ప్రజాశక్తి
శనివారం 25 జనవరి 2025
5
శ్రీ సత్యసాయి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

26వ తేదీ జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలోని పోలీస్ పేరేడ్ మైదానంలో జరగనున్న గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లను పుట్టపర్తి ఆర్డీవో సువర్ణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పరేడ్ మైదానంలో స్టాళ్ల ఏర్పాటు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వివిఐపిలు, విఐపిల, గ్యాలరీలు, మైదానంలో శకటాల ప్రదర్శనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులతో చర్చించారు. పరేడ్ మైదానంలో సందర్శకులు వీక్షించడానికి ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా వేడుకలు నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

కాసుల కోసం కార్పొరేట్ కళాశాలలు వెంపర్లాడుతున్నాయి. తమ కళాశాలలో చేర్చాలంటూ పరీక్షలు కూడా పూర్తవకనే యాజమాన్యాలు ఫోన్లు చేసి తల్లిదండ్రుల వెంటపడుతున్నారు. ముందస్తుగా అడ్వాన్స్ చేసి సీటు రిజర్వు చేసుకోవాలని కోరుతున్నారు. ఆలస్యమయితే సీటు దొరకదు.. ఒకవేళ దొరికినా అప్పుడు ఫీజు ఎక్కువగా ఉంటుందంటూ తల్లిదండ్రులను భయపెట్టే విధంగా చెబుతూ వారి విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునే ప్రయత్నాన్ని ఇష్టారీతిన చేస్తున్నారు.

కార్పొరేట్ కాసులవేట..!

- ◆ పదవ తరగతి పూర్తవకనే చేర్చాలని ఫోన్లు
- ◆ చేరాక తల్లిదండ్రులకు చుక్కలు
- ◆ బోధన కంటే ఫీజులపైనే దృష్టి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తమ కళాశాలలో చదివితే మంచి విద్య వస్తుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆయా కళాశాలల సిబ్బంది వెంపర్లాడుతున్నారు. కళాశాలల్లో విద్యార్థులు చేర్చే విషయంలో సిబ్బందికి ప్రత్యేకమై కోటాలున్నాయి. దీంతో ఇప్పటికే పదవ తరగతి చదువుతున్న వారి వివరాలు, మొబైల్ ఫోను నంబర్లు సేకరించారు. ఇక ఆలస్యం చేయకుండా పిల్లాడిని తమ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు కోరుతున్నారు. ఆలస్యం చేస్తే సీట్లు దొరకవు కాబట్టి ముందుగా కొంత మొత్తాన్ని చెల్లించి రిజర్వు చేసుకోవాలని చెబుతున్నారు. ఇంకా పిల్లాడు పదవ తరగతి పరీక్ష కూడా రాయలేదు. ఏ విభాగంలో చేరాలన్నది కూడా తల్లిదండ్రులు, పిల్లలు నిర్ధారించుకోలేదు. కార్పొరేట్ కళాశాలలు మాత్రం అప్పుడే విద్యార్థులను చేర్చుకునేందుకు వెంపర్లాడుతున్నారు. ఒక్కసారి చేరాక ఆ తరువాత ఫీజుల చుక్కలు కనబడుతున్నాయి. సాధారణ కళాశాలల్లో చేరితే తమ పిల్లలకు చదువు వస్తుందో రాదో... ఎంసెట్ సీట్ ఏమోనన్న భయంతో వేలకు వేలు కట్టేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఇలా కార్పొరేట్ కళాశాలల్లో చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు కట్టకపోతే వేధింపులు తప్పడం లేదు. ఈ వేధింపులతో ఏటా విద్యార్థులు బలవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఆ కళాశాలలపై చర్యలకు వెనుకాడుతున్నారు. ఫిర్యాదలందినా చూసి చూడనట్టుగానే ఉంటుండటం గమనార్హం.

ప్రభుత్వం నియంత్రించాలి

ప్రభుత్వ ఆదేశాలిచ్చే వరకు అడ్మిషన్లు జరగడానికి వీల్లేదు. కాని కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి విద్యా సంవత్సరం ప్రారంభం కాకనే అడ్మిషన్లు అని ముందస్తుగా అడ్వాన్సులు వసూలు చేస్తున్నాయి. ఈ అంశాలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలుండం లేదు. ఫీజుల విషయంలోనూ వేధింపులకు పాల్పడకూడదని ప్రభుత్వం చెబుతున్నా కళాశాలలు విద్యార్థులను వేదిస్తున్నాయి. ఈ వేధింపులతోనే నారాయణ కళాశాలలో చైతన్య అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా అధికారులు ఈ విషయంలో కళాశాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. సాధారణమైన అంశంగానే పరిగణిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి.

పరమేష్ , ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కాఫీ విత్ వైసిపి లీడర్స్ కార్యాక్రమంలో పాల్గొన్న ఉషశ్రీ చరణ్

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-రొద్దం

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. మండలంలోని సానిపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆమె 'కాఫీ విత్ వైసిపి లీడర్స్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గుడ్ మార్నింగ్ అంటూ ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ గ్రామంలో కలియ తిరిగారు. ఈ సందర్భంగా కంది పంట సాగు చేసిన రైతులను పలకరించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు కంది పంట సాగు చేశారన్నారు. కావున ప్రభుత్వం రైతుల వద్ద గిట్టుబాటు ధరకు కందులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ నూతన కమిటీని ప్రకటించారు. పంచాయతీ అధ్యక్షులుగా వి.రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కురుబ గంగాధరప్ప, యువత అధ్యక్షులుగా డి.హనుమంతరాయుడు, ఉపాధ్యక్షులుగా అనిల్, రైతు అధ్యక్షులుగా శ్రీనివాసురెడ్డి, మహిళా అధ్యక్షులుగి సి.పద్మావతి, బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎ.వీరాంజి, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా హెచ్.గంగాధర, ఉపాధ్యక్షులుగా గంగాధర్, బిసి సెల్ అధ్యక్షులుగా చంద్రప్ప, ఉపాధ్యక్షులుగా రామంజి, సోషల్ మీడియా అధ్యక్షులుగా ఈ.క్రిష్టప్ప, బూత్ కమిటీ ఉపాధ్యక్షులుగా ఆటో శ్రీనివాసులు, సోషల్ మీడియా ఉపాధ్యక్షులుగా వి.శ్రీనివాసులు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ వైసిపి మరింత బలోపేతం కావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఆమె వెంట మండల కన్వీనర్ తిమ్మయ్య, నాయకులు సుధాకర్‌రెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, కుర్లపల్లి నారాయణరెడ్డి, తురకలా పట్నం నరేంద్రరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఫీజుల వేధింపులు దుర్మార్గం

- ◆ తరగతి బయట నిల్చోబెట్టడంతోనే విద్యార్థి ఆత్మహత్య
- ◆ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- ◆ స్పందించకుంటే ప్రత్యక్ష ఆందోళనలు
- ◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- బత్తలపల్లి

పాఠాలు చెప్పాల్సిన విద్యాలయాల్లో ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేసి విద్యార్థుల ప్రాణాలను తీసేలా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమైన చర్యని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. గురువారం నాడు అనంతపురం నారాయణ కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో విద్యార్థి చరణ్ తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ చరణ్ తండ్రి వెంకటనారాయణ ఆవులు మేపుకుంటూ తన ఇద్దరు కుమారులను చదివిస్తున్నారని తెలిపారు. కుమారులను ఉన్నత స్థానంలో చూడాలని భావించిన ఆయనకు కార్పొరేట్ కళాశాల ఫీజులుం తీవ్ర శోకాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించలేదన్న కారణంతో విద్యార్థి చరణ్‌ను గంటల తరబడి తరగతి బయట నిలబెట్టడంతో యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాధకరమైన ఘటన అన్నారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ నిమిత్తం వెంకటనారాయణకు రూ.28 లక్షలకు పైగా అప్పులు ఉన్నాయన్నారు. ఇప్పుడు కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబం మరింత వేదనలో కూరుకుపోయిందన్నారు. అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులకు ఫీజుల పేరుతో తీవ్ర దు్ఖం మిగిలుస్తున్న కార్పొరేట్ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం నారాయణ కళాశాలకు కనీసం రక్షణ ఏర్పాట్లు ఉన్నాయా అని పరిశీలించకుండా అనుమతి ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు, మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను రెసిడెన్సియల్ కళాశాలలుగా ఏర్పాటు చేసి కార్పొరేట్ వ్యాపారాన్ని అడ్డుకోవాలన్నారు. ప్రయివేటు కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థి చరణ్ కుటుంబాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వం స్పందించక పోతే రాజకీయపార్టీలు, విద్యార్థి సంఘాలను కలుపుకుని ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓతూరు పరమేష్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షులు దామోదర్, ఎస్‌కె యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, మోహన్‌లు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎంఈఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ భవన్‌లో శుక్రవారం తాలూకా ఎంఈఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగనాథ్, ఉగ్రనరసింహ ఆధ్వర్యంలో నాయకులు సమావేశమయ్యారు. ముందుగా ఎంఈఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.భూతన్న, జిల్లా కార్యదర్శి మాలింగప్ప మాట్లాడుతూ ఇటీవల పుట్టపర్తిలో నిర్వహించిన జిల్లా ఎంఈఎఫ్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు, జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్‌మౌర్య పలు సూచనలు చేశారన్నారు. అందు లో ఎంఈఎఫ్ సభ్యత్వ నమోదు, జాంభవ భవన్ నిర్మాణానికి విరాళాల సేకరణ, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆత్మీయ సన్మానసభను విజయవంతం చేయాలని సూచించారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణ, శివన్న, నాగేష్, కదురన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

గవర్నర్ కార్యాలయం నుంచి విద్యార్థికి ఆహ్వానం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక నీలం సంజీవరెడ్డి జడ్పీ హైస్కూల్‌లో గతేడాది 2023-24లో పదో తరగతి పరీక్షల్లో మండలంలో మొదటి స్థానంలో నిలిచిన యు.సాయికిరణ్‌కు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనా లని గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందినట్లు తెలిపారు. సాయికిరణ్‌ను తహశీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఎంపిడిఓ నరసింహమూర్తి, ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప, హెచ్ఎం వివిసి గిరి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-మడకశిర

రీ సర్వే అధికారులకు రైతులు సహకరించాలని తహశీల్దార్ షెక్షావలి కోరారు. రొళ్ల మండలంలోని తూబినకుంట రెవెన్యూ గ్రామం శుక్రవారం భూ రీ సర్వే చేపట్టారు. తూబినకుంట గ్రామంలో పొలం ఉన్న రైతులు, గ్రామస్తులు సిబ్బందికి సహకరించి మీ భూమి వివరాలు సరిగా ఉన్నాయా లేదా చూసుకోవాలన్నారు. రీ సర్వేలో మండల, విలేజ్ సర్వేయర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

రీ సర్వేలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, రైతులు

పరిటాల ఆశయాలను కొనసాగిస్తాం

వర్ధంతి సభలో కుటుంబ సభ్యులు - వెంకటాపురంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభిమానుల నివాళి

ప్రజాశక్తి-చెన్నెకొత్తపల్లి

పరిటాల రవీంద్ర ఆశయాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు. మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరిటాల రవి 20వ వర్ధంతి కార్యక్రమాన్ని అభిమానుల మధ్య వెంకటాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. రవి సతీమణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కుమారుడు పరిటాల శ్రీరామ్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. వీరితో పాటు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యేలు విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్.రాజు, పల్లె సింధూరరెడ్డి, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హనుమంతరాయచౌదరి, ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజనప్ప తదితరులు నివాళి అర్పించారు. ఉమ్మడి అనంతతో పాటు పావగడ ప్రాంతం నుంచి వచ్చిన పరిటాల అభిమానులతో వెంకటాపురం జనసంద్రంగా మారింది. రవి ఘాట్ వద్ద నివాళులు అర్పించిన సమయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఉద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతి వర్ధంతి రోజునా వెంకటాపురం తరలొచ్చే అభిమానులను చూస్తుంటే ప్రజల గుండెల్లో రవి ఎంత బలంగా ఉన్నారో అర్ధమవుతోందన్నారు. ఆయన మరణించి 20 ఏళ్లైనా ఇప్పటికీ అభిమానులు గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారన్నారు. త్వరలో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వందేళ్ల తర్వాత కూడా పరిటాల రవి పేరును చెప్పుకునేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు రవితో వారికున్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. పెనుకొండలో పరిటాల రవి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత తెలిపారు. వర్ధంతి సందర్భంగా వెంకటాపురంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘనాథరెడ్డి తదితరులు

బాలల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పెనుకొండ

బాలలు జాతీయ సంపద.. వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అబ్బాయిలే కాదు అమ్మాయిలు కుడా వారసులే అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్‌లో శుక్రవారం ఆర్‌డిటి, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు స్థానిక మహాత్మ గాంధీ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్‌డిటి మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, సిడిపిఒ శాంతలక్ష్మి హాజరై మాట్లాడారు. బాలలు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. భవిషత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. పెనుకొండను బాల్య వివాహాలు లేని మండలంగా తీర్చిదిద్దాలన్నారు. బాలికలు ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలపై అవగా హన కలిగి ఉండాలన్నారు. చట్టాలు, బాల్య వివాహం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఏరియా టీం లీడర్ సుధాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, ప్రిన్సిపల్ జ్యోతిలత, ఉపాధ్యాయులు, న్యాయ విద్యార్థి ప్రవీణ్‌కుమార్, ఆర్‌డిటి కౌన్సిలర్ నాగలక్ష్మి, మహిళా పోలీస్ శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

రొద్దం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ అనురాధ, సుజాతమ్మ, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారసులు అంటే అబ్బాయిలు మాత్రమే కాదు అమ్మాయిలు కుడా అన్నారు. కంచి సముద్రం ఎంపిపి స్కూల్‌లో హెచ్ఎం నరేష్ మాట్లాడుతూ బాలలు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ అనురాధ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం చేయాలని ప్రయత్నిస్తుంటే వెంటనే 1098, 100 కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ అనూష, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దంలో జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

బాల్య వివాహాలను అరికడదాం

లేపాక్షి : స్థానిక కస్తూర్బా పాఠశాల, కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ నీలిమ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ అధికారి ణిలు బాల్య వివాహం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలు, అనర్థాలు, ఇబ్బందులను వివరించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల, భాగ్యమ్మ, సంపూర్ణమ్మ, మహిళా పోలీసు ఉష, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న గుండుమల తిప్పేస్వామి

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర

గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. మండలం లోని గౌడనహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను శుక్రవారం గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. అనంతరం గౌడనహళ్లి టిడిపి సీనియర్ నాయకులు అశ్వత్థప్ప ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని అక్కడకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు గోవిందప్ప, సుబ్బారెడ్డి, నరసింహప్ప, తిమ్మప్ప, సోమశేఖర్, కిష్టప్ప, నాగప్ప, చిన్న నరసింహప్ప, సన్న హనుమంతు, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

పరిటాల రవి వర్ధంతిలో పాల్గొన్న ఎంఎస్.రాజు, గుండుమల

వెంకటాపురం గ్రామంలో జరిగిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్, మద్దనకుంటప్ప, కుమారస్వామి, జడ్పిటిసి ఉమేష్ పాల్గొని నివాళులు అర్పించారు.

పరిటాల రవి విగ్రహం ఏర్పాటు చేస్తాం

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో పరిటాల రవీంద్ర విగ్రహం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రవి చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి పరిటాల రవీంద్ర అని కొనియాడారు. ఫ్యాక్షనిస్టుల అరాచకాలతో బలవుతున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలిచి, సమాజ సమానత్వ సాధన కోసం కృషి చేశారన్నారు. టిడిపి నాయకుడిగా, మంత్రిగా ఆయన సేవలు మరువ లేనివన్నారు. పరి టాల రవి అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నారాయణస్వామి, వెంకటరాముడు, శ్రీరాములు యాదవ్, వెంకటరమణ, శ్రీనివాసులు, షౌకత్, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెనుకొండలో పరిటాల రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, టిడిపి నాయకులు, కార్యకర్తలు

పరిటాలకు నివాళి

ప్రజాశక్తి - కదిరి టౌన్

మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతిని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, బహుఉద్దీన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలో పరిటాల రవి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ నాయుడు, కోట్ల బాబి, గోవిందు, క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, ఉత్తమ నాయుడు, మల్లెల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండల కేంద్రంలో శుక్రవారం మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు కార్యకర్తలు పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కూచి రామ్మోహన్, ధర్మవరం నియోజకవర్గం బీసీ సెల్అధ్యక్షులు ముసుగు శ్రీనివాసులు, ఉమ్మడి అనంతపురం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు : మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జిరిపిటి అంజినప్ప, టిడిపి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి జిరిపిటి ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : పరిటాల రవీంద్ర వర్ధంతి వేడుకలు మండల కేంద్రంలో టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనూ, నాలుగు రోడ్ల కూడలిలోనూ పరిటాల రవీంద్ర చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జులు నెట్టెం రమణ, కాకర్ల సురేంద్ర, సంఘాల సూరి, వాటర్ ప్లాంట్ శ్రీరాములు, సదాశివ, బొజ్జప్ప, చంద్రశేఖర్, బీదల నారాయణస్వామి, కుంటాల రాము, పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డివిజన్ బిసి సంక్షేమ శాఖ వసతిగృహ సంక్షేమ అధికారిపై చేసిన ఆరోపణలు అవాస్తవమని ఎబిసిహెచ్‌ఒ, హెచ్‌డబ్ల్యూఒ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కదిరి డివిజన్‌లోని అన్ని హాస్టళ్లలోనూ మెనూ అమలు చేస్తున్నామని చెప్పారు. తమపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులతో విచారణ చేసినా సిద్ధంగా ఉన్నామన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

టిబి, కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లెప్రసీ నోడల్ ఆఫీసర్ రామ్మోహన్, సూపర్వైజర్ అబిద్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు అనిల్, మానస, ఎఎన్ఎంరామాంజనమ్మ, ఆశాలక్ష్మీదేవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని రెక్కమానులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ కిరణ్ కుమార్ రెడ్డి, సర్పంచి సుధాకర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో పైపులైను దెబ్బతినిందన్నారు. వెంటనే మరమ్మతులు చేపడతామనితెలిపారు.

పక్కాగా ఇంటింటి చెత్త సేకరణ

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఇంటింటి నుంచి పొడి చెత్త, తడి చెత్తను సేకరించి తద్వారా ఎరువును తయారు చేసుకొని విక్రయించాలని డిఎల్‌పిఒ శివకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంపద తయారీ కేంద్రం నిర్వహణ గురించి కార్యదర్శి నారాయణస్వామిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని వ్యర్థాలను ఇక్కడికి చేర్చి వాటి ద్వారా ఎరువులను తయారీ చేయాలని సూచించారు. అనంతరం కేంద్రంలో రెండు బిడ్లల్లో సేంద్రీయ ఎరువు తయారీ కొరకు వానపాములను వదిలారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహనాయుడు, ఈవోఆర్డీ క్రిష్ణప్ప, అనంతపురం నుంచి వచ్చిన వర్మీ సేల్స్ మెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కురుబ సంఘం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోటి సురేష్

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రానికి చెదిన వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్‌ను కురుబ సంఘం రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని శ్రీరామతులసీ కల్యాణ మండపంలో శ్రీభక్త శ్రేష్ఠ కనకదాసు 537వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. అక్కడే రాష్ట్ర అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. ఆయన ఆధ్వర్యంలో కమిటీలను ఎన్నుకున్నట్లు నాయకులు చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులఅందరికీ కోటి సురేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం : డిపిఒ

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఆయా పంచాయతీల కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో అభివృద్ధి, నిధులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో మెరుగైన నీటి సరఫరాలకు అవసరమైన చర్యలను త్వరగా చేపట్టాలన్నారు. నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉంటుందన్నారు. అదే విధంగా పంచాయతీల్లో వంద శాతం ఆస్తి, నీటి పన్నులు వసూలు చేయాలన్నారు. పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా పన్నులు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆమె కిరికెర పంచాయతీలోని ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సరస్వతి, ఇఒఆర్‌డి శివ కుమార్‌లతో పాటు వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సమత

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్లపైనే మురుగు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వేణుగోపాల్ స్వామి కాలనీ వీధుల్లో మట్టి రోడ్లు కావడంతో నివాసాల ముందు డ్రైనేజీ సౌకర్యం లేక మురుగునీరు రోడ్లపై పారుతోందని స్థానికులు వాపోతున్నారు. కాలనీ మధ్యలోనే నీళ్లు పేరుకుపోయి ఎక్కడికక్కడ మురుగు గుంతలు ఏర్పడ్డాయని అంటున్నారు. విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

మాజీ మావోల స్థలాలు అప్పగించాలి : వ్యకాసం

సమావేశంలో పాల్గొన్న మాజీ మావోలు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆక్రమణకు గురి అయిన మాజీ మావోయిస్టుల స్థలాలను వారిలోనే అర్హులకే కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కోశాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. మాజీ మావోయిస్టు రాజారాం ఆధ్వర్యంలో మాజీమావోలు శుక్రవారం పుట్టపర్తి ఆర్డీవో సువర్ణను కలసి సమస్యను విన్నవించారు. గత 12 సంవత్సరాల క్రితం ధరణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 128 మంది మాజీ నక్సల్స్‌కు పునరావసం కల్పించేందుకు 4.30 ఎకరాల స్థలాన్ని ఏడున్నర లక్షల రూపాయలకు కొనుగోలు చేసి 128 మంది సభ్యులకు స్థలాలను కేటాయించామన్నారు. అందులో సంస్థకు సంబంధం లేని ఒక వ్యక్తి గత ధరణి సొసైటీలో సభ్యత్వం లేని వారికి స్థలాలను కేటాయించి, కొన్ని సైట్లను అమ్ముకున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్న కాలనీలో పనులను ఆపేయమని ఆదేశాలు జారీ చేస్తామని ఈనెల 26వ తేదీ వరకు ఇద్దరు కానిస్టేబుళ్లను అక్కడ ఉంచి కాలనీలో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా చూస్తామని చెప్పారు. అనంతరం మాజీ నక్సల్స్ కు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, మాజీ మావోయిస్టు రాజారాం, ధరణి కమిటీ సభ్యులతో కలిసి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద గల కాలనీలో నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొంతమంది నాయకులు తమ స్వలాభాల కోసం ధరణి అసోసియేషన్ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, స్థలాలు అమ్ముకుంటున్నారని విమర్శించారు. మాజీ మావోలకు కేటాయించిన స్థలాలపై రాజకీయాలు చేస్తున్నారని, కోర్టు, రెవెన్యూ అధికారులు ఈ స్థలాలు ధరణి వెల్ఫేర్ సొసైటీకే దక్కాలని రికార్డుల ద్వారా చెబుతున్న దౌర్జన్యంగా వారికి దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం మాజీ మావోలకు అండగా ఉంటుందని వారి స్థలాలు వారికి లభించేంతవరకు పోరాటం చేస్తుందని అన్నారు. మూడు నెలల క్రితమే ధరణి వెల్ఫేర్ సొసైటీకి ఈ భూమి చెందుతుందని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని దాని ప్రకారం ఆ స్థలాలను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మావోయిస్టులు బాలు, అమగొండపాలెం, శ్రీనివాసులు, బాలరాజు, రామచంద్ర, సరస్వతి, పుష్పావతి, శాంతి బాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

తమకు ప్రభుత్వం 2007వ సంవత్సరంలో ఇళ్లస్థలాలను కేటాయించి, తిరిగి ప్రభుత్వం తీసుకొన్నదని...అయితే ఇప్పటికి ఆన్‌లైన్ లో తమ పేర్లు ఉన్నాయని, తమ పేర్లను ఆన్ లైన్ నుంచి తొలగించండి లేదా తమకు కేటాయించిన స్థలాన్ని తమకు ఇవ్వాలని బాధితులు కోరారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ అమరేంద్రకు వినతిపత్రం సమర్పించి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా బాదితులు మాట్లాడుతు పట్టణంలో నివాసం ఉంటు ఇల్లు లేని తమకు 2007వ సంవత్సరంలో కొటిపి వద్ద సర్వే నెంబరు 35-1లో ఇళ్లస్థలాలను కేటాయించారన్నారు. దీంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు రుణాలను సైతం మంజూరు చేశారన్నారు. దీంతో ఆ సమయంలో తమ వద్ద ఉన్నా డబ్బులతో పునాదులు వేసుకున్నామని దీనికి సంబందించి గృహ నిర్మాణ శాఖ వారు బిల్లు సైతం మంజూరు చేశారని చెప్పారు. అనంతరం ఒక్క సారిగ ధరలు పెరగడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు వాటిపై ఏ మాత్రం పట్టించు కోలేదన్నారు.అయితే వైసిపి ప్రభుత్వం తాము నిర్మించుకున్న పునాదులను పగలగొట్టి స్థలాలను స్వాదీనం చేసుకుందన్నారు. అయితే ఇప్పటికి ఆన్ లైన్ లో తమ పేర్లు ఉండడంతో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు. ఆన్ లైన్ లో తమ పేర్లు తొలగించి, తమకు ఇళ్ల స్థలాలను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఆర్ఐ మాట్లాడుతు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాదితులు విజయ, గంగమ్మ, జయమ్మ, ఆశ్వర్థమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్వయంశక్తి సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి



సంచికను ఆవిష్కరిస్తున్న అధికారులు, ఆర్పీలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని స్వయం శక్తి సహాయక మహిళా సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ విశ్వ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో మహిళా సంఘాల ఆర్‌పిలకు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా పట్టణ పేద మహిళలను సంఘాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించడం ద్వారా మరింత అధికంగా రుణాలు తీసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక, సామాజిక పథకాలపై ప్రతి మహిళలకు అవగాహన పెంచుకుని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని మెప్మా సంస్థ నిశ్చయించుకొని సంబంధిత అన్ని అంశాలను సమీకరించి పుస్తకరూపంలో తీసుకురావడం జరిగిందని తెలిపారు. సంబంధిత పుస్తకాలను ఒబిలు, ఆర్‌పిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా టిఇఐబి.భవాని, డిఎంసిఎల్ గంగులయ్య, డిఇఒ ఇబ్రహీం ఖాన్, సిఒలు తౌసిఫ్, నాగేశ్వరి, పరం జ్యోతి, వరలక్ష్మి, గంగరత్నలు, పట్టణ సమాఖ్య ఒబిలు విజయ లక్ష్మి, సరస్వతమ్మ, ఆర్.సుజాత, నలిజాక్షి, శంకరమ్మ, ఆర్‌పిలు పాల్గొన్నారు.

బాలికల రక్షణ సంస్థలపై అవగాహన అవసరం

కదిరిలో నిర్వహించిన బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

బాలికలకు చదువుతోపాటు రక్షణ సంస్థలపై అవగాహన కలిగి ఉండాలని హెడ్మాస్టర్ మేరీ వర కుమారి తెలిపారు. పట్టణంలోని కొత్తపేటలో గల ప్రభుత్వ మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని బాలికలు, ఉపాధ్యాయుల నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మేరీ వర కుమారి మాట్లాడుతూ బాలికలకు ఉన్న హక్కులపై పోరాడినప్పుడే తగిన న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని కెవిహెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలికాదినోత్సవాన్ని నిర్వహించారు.

కదిరి టౌన్ : బాలికలు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించి అన్ని రంగాల్లో రాణించాలని వైద్యులు డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ రేణుక సూచించారు. కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలోని హరీష్ పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రిన్సిపల్ యంయస్. కిరణ్ అధ్యక్షతన జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : బాలికలు చదువులతోపాటు అన్ని రంగాల్లో రాణించి ముందుకు సాగాలని సిడిపిఒ గాయత్రి తెలిపారు. శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌కౌసల్య సాయి, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని మల్ల మీద పల్లి యుపి పాఠశాల, కటారపల్లి క్రాస్ వద్ద ఉన్న కెజిబివిలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహేశ్వర మారుతి, హెచ్ఎమ్ హైదరవలి మాట్లాడుతూ బాలికల హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ కుమార్, సూపర్‌వైజర్ ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యాసాగర్, శ్రీరాములు, అంగనవాడీలు లక్ష్మీదేవి సుకన్యతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండల కేంద్రంలోని కెజిబివిలో శుక్రవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు మహిళా చట్టాలపై,బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నరసమ్మ, మౌలాబీ, లక్ష్మీదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల : మండల కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ దీప ఆధ్వర్యంలో బాలిక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు అంగన్వాడి టీచర్లు ర్యాలీ నిర్వహించారు. బాలికల హక్కులు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమానాయక్, జిఎంఎస్‌కెలు కవిత, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బాలిక దినోత్సవం , అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యనమలపల్లి ప్రాథమిక పాఠశాల, జగరాజుపల్లి కెజిబివిలో వైద్యాధికారులు జ్యోత్స్న భవ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, కెజిబివి ఎస్ఒ నాగ సుప్రజ, ఉపాధ్యాయులు బసుర్ బీ, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్తలు వీరచిన్నమ్మ, ప్రమీల, జయమ్మ, ఆశా కార్యకర్తలు మంజుల, జ్యోతి పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - తనకల్లు

మండలంలోని పరాకువాండ్లపల్లి వద్ద నిర్వహించిన తనిఖీల్లో కర్నాటక మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సిఐ మారుతి రావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం రాత్రి నిర్వహించిన దాడుల్లో నల్లచెరువు మండలంలోని బాలేపల్లి తండాకు వెళ్లే దారిలో కారును ఆపి సోదాలు నిర్వహించారు. 14 బాక్సుల్లో ఉన్న 1344 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నల్లచెరువు మండలానికి చెందిన నాగేంద్ర, ఎస్. నాగభూషణ అని అధికారులు తెలిపారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - కదిరి టౌన్

.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని మోటర్ వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్, సిఐలు నారాయణ రెడ్డి, నిరంజన్ రెడ్డి వాహన చోదకులకు సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కదిరి పట్టణం లో రవాణా, పోలీస్ ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు, యజమానులకు, ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. గులాబీలు అందజేసి అవగాహన కల్పించారు. అందులో భాగంగా 500 కరపత్రాలను పంపిణి చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవిఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లేత జొన్నగడ్డి విషంతో సమానం

ప్రజాశక్తి - బత్తలపల్లి

లేత జొన్న గడ్డి గొర్రెలకు విషంతో సమానమని వాటిని తిన్న గొర్రెలు వైద్యసహాయం అందేలోపు మృతి. చెందుతాయని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పరాచెరువు పంచాయతీలోనూ, మాల్యవంతం పంచాయతీలోని వెంకటగారిపల్లి గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేత జొన్న గడ్డిలో హైడ్రోజన్ సైనిక్ అనే విషపదార్థం ఉంటుందని గడ్డితిన్న వెంటనే గొర్రెలు చనిపోతాయని ఇది గుర్తించి గొర్రెల మేపుకు తీసుకువెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్‌నాయక్, మారుతి. సాయి, మురళి, తిరుపతయ్య, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్ర సమీపంలోని చిన్న మిట్ట వద్ద ఏర్పాటు చేస్తున్న అయ్యప్ప ఆలయం నిర్మాణానికి వైసిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనవంతుగా విరాళం అందజేశారు. ఈ మేరకు లక్ష రూపాయలను ఆలయ కమిటీ సభ్యుడు జక్కల లక్ష్మీ నరసింహ గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

ఆరోగ్యమైన వారందరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలని వక్తలు పేర్కొన్నారు. ఎఐఒసిడి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఔషధ కార్యాలయం ముందు మెడికల్ రిప్రజెంటేటివ్ లు,

రక్తదానం చేస్తున్న దాత

మెడికల్ షాపుల నిర్వాహకులు శుక్రవారంరక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు ప్రతి మూడు, ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల అనారోగ్యానికి గురవుతారన్న అపోహలను విడనాడాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో భాగంగా హిందూపురంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్స్ అధ్యక్షులు శివకుమార్, ఉపాధ్యక్షులు బద్రీ, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి అనిల్, అజంతుల్లా, రాజేష్, శివప్రకాష్ లతో పాటు మెడకల్ రిప్రజెంటేటివ్‌లు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులతో పట్టణాభివృద్ధి

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ కౌన్సిలర్లు వారి పరిధిలోని వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి, వివరాలను అందిచాలని వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జులను బాలయ్య వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతు పట్టణ అభివృద్ధి కోసం త్వరలో రూ.92కోట్ల ప్రత్యేక నిధులు వస్తాయన్నారు. దీంతో పాటు నీటి సరఫరా, పైప్ లైన్ మరమ్మతుల కోసం మరో రూ.120 కోట్లు, ఎస్‌టిపిల ఏర్పాటు తదితర అభివృద్ధికి మరిన్ని నిధులను ఎమ్మెల్యే బాలకృష్ణ తీసుకురానున్నారని చెప్పారు. ఇందులో బాగంగా వార్డుల్లో నెలకున్న సమస్యలను గుర్తించి, వాటి వివరాలను అందించాలన్నారు.. ఈ సమావేశంలో బాలయ్య పిఎ బాలాజీ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల మండలానికి హంద్రీనీవా నీరు

ప్రజాశక్తి కదిరి అర్బన్

తమ మండలానికి హంద్రీనీవా నీరు చేరుతుండటంతో ఆ మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కందికుంట వెంకటప్రసాద్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అంటున్నారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మండలంలోని రెడ్డెమోలపల్లి సమీపంలో హంద్రీనీవా కాలువలో నీటి ప్రవహించడంతో ఆ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నో ఏళ్లుగా ఆశలు పెంచుకున్న తాము ఎమ్మెల్యే చొరవతో హంద్రీనీవా నీటిని తాము తమ మండలంలో చూస్తున్నామన్నారు. ఈ నీటితో మండలంలోని చెరువులను నీటితో నింపుకుంటామన్నారు. నీటి నిల్వతో తమ ప్రాంతంలో భూగర్భజలాలు పెరుగుతాయని అంటున్నారు. ఫలితంగా తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కదిరి మండలం పట్నం వద్ద ఎమ్మెల్యే కందికుంట విడుదల చేసిన కృష్ణాజలాలు తలుపుల మండలంలో పరుగులు తీస్తున్నాయంటున్నారు. అప్పట్లో పుంగనూరు ప్రధాన కాలువ పనులు అసంపూర్తిగా ఉండటంతో నీళ్లు రాలేదన్నారు. ఎన్నికల ముందు కృష్ణా జలాలను ప్రధాన కాలువకు విడుదల చేసినా.. అదే రోజే ఆపేశారని విమర్శిస్తున్నారు. సుమారు రెండువేల ఎకరాల్లో ప్రత్యక్షంగా, మరో ఆరువేల ఎకరాల్లో పరోక్షంగా పంటలకు హంద్రీనీవా కాలువ నీటి జలంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు శంకర్ మాట్లాడుతూ రంగనాయకచెరువు నిండితే రెండు పంటలు పండించుకోవచ్చున్నారు. చెరువు కింద దాదాపు 7 వందల ఎకరాల ఆయకట్టు సాగవుతుందన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలే ఎక్కువ అన్నారు. భూమి ఉండి నీటి వసతి లేక, దినకూలీ, చిరువ్యాపారాలు చేసుకుంటు ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణాజలాలు తలుపుల మండలానికి రావడంతో పంటలు సాగు చేసుకుంటామని చెప్పారు.

కాలువలో ప్రవహిస్తున్న హంద్రీనీవా నీరు